# అభివృద్ధిని చూసే చేరికలు

కొండాపూర్, సెప్టెంబర్ 30: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే శనివారం రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ సమక్షంలో మండల పరిధిలోని తమ్మలి బాయి తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉప సర్పంచ్ మోహన్ నాయక్, పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించి వారి గ్రామాల్లో వారినే పరిపాలన చేసుకునేలా చేశారన్నారు. కాంగ్రెస్ ఖేల్ ఖతమైందని, ఎన్నికలు సమీపిస్తున్నందున కాంగ్రెస్ నాయకులు కళ్లబొల్లి మాటలతో ముందుకు వస్తారని, వారిని నమ్మొద్దన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతోనే తమ్మలిబాయి తండాను ప్రత్యేక పంచాయతీగా చేశామని, ప్రస్తుత ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండరు, సమస్యలను పరిష్కరించరని ఆరోపించారు. అనంతరం తండా వాసులు, స్థానిక నాయకులు మాట్లాడుతూ సంగారెడ్డి ఎమ్మెల్యేగా ఈసారి చింతా ప్రభాకర్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతీఅర్జున్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకం విఠల్, జడ్పీటీసీ పద్మావతీపాండురంగం, సర్పంచ్‌లు షఫీ, ప్రకాశ్, వైస్ ఎంపీపీ లక్ష్మీరాంచందర్, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు రామాగౌడ్, జగదీశ్వర్, ఎంపీటీసీ రాందాస్, గోవర్ధన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మాణిక్యప్రభ, ఇంద్రారెడ్డి, మోహన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, మల్లేశం, మోహన్‌రాజ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

- తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- బీఆర్ఎస్‌తో గ్రామాల అభివృద్ధి
- రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

## ‘గృహలక్ష్మి’తో..

# సొంతింటి కల సాకారం

- నిరుపేదలకు గూడు కల్పించడమే సీఎం కేసీఆర్ లక్ష్యం
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- నియోజకవర్గంలోని మూడు వేల మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు అందజేత
- జిన్నారం మండలం మాధారంలో నియోజకవర్గస్థాయి సమావేశం



తెలంగాణ తల్లి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మహిళా ప్రజాప్రతినిధులు

జిన్నారం, సెప్టెంబర్ 30: దేశంలోనే మొదటి సారిగా తెలంగాణలో డబుల్ బెడ్‌రూమ్ పథకాన్ని, సొంత జాగా ఉన్న వారికి రూ.మూడు లక్షలు అందించేందుకు గృహలక్ష్మి పథకాన్ని అందిస్తూ సీఎం కేసీఆర్ పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలం మాధారం గ్రామం కొలను అనంతరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని నిరుపేదలకు రూ.3లక్షల ఆర్థిక సాయం అందించేందుకు సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చారని, మొదటి విడతలో నియోజకవర్గ వ్యాప్తంగా మూడు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు మూడు విడతల్లో డబ్బు అందుతుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇందిరమ్మ ఇండ్లలో వేల కోట్ల అవినీతి జరిగిందని, అవినీతికి కేంద్రంగా ఆ పథకం నిలిచిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే ఇండ్ల కేటాయింపు చేసి, కోట్ల రూపాయల ప్రజల సంపదను పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు అమలుకు చేతగాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు తెలివైనవారని, సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. 65 ఏండ్లలో చేయని అభివృద్ధిని పదేండ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి చిరునామాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని ప్ర జలను కోరారు. అంతకుముందు తెలంగాణ తల్లి చిత్రపటం వద్ద నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి గూడెం యాదమ్మ, ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు రవీందర్‌గౌడ్, సుష్మావేణుగోపాల్ రెడ్డి, దేవానంద్, ప్రవీణాభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీలు సుప్రజావెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కార్పొరేటర్లు కుమార్‌యాదవ్, పుష్పానగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు రోజాబాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, లలితాసోమిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, ఆత్మకమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, తహసీల్దార్లు రవికుమార్, భాస్కర్, సంగ్రామ్‌రెడ్డి, గౌరివత్సల, గంగాభవాని, ఎంపీడీవోలు రాములు, బన్సీలాల్, మల్లేశం, చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, సర్పంచ్‌లు సరితాసురేందర్‌గౌడ్, చెట్టి శివరాజ్, ప్రకాశ్ చారి, జనార్దన్, సత్యనారాయణ, ఆంజనేయులు, రేఖాకృష్ణ, ఖదీర్, ప్రశాంతీనరేందర్, లావణ్యాశ్రీనివాస్‌రెడ్డి, లావణ్యాజీవన్, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు స్వాతీప్రభాకర్‌రెడ్డి, సంతోషీమహేశ్, లావణ్యానరేశ్, జనాబాయి, ఆకుల భార్గవ్, నాయకులు తులసిరెడ్డి, యూనుస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాధారంలో కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గంలోని మహిళా లబ్ధిదారులు

# దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్

## మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

- ఎమ్మెల్యేకు మద్దతు పలికిన ప్లంబర్, ఆటో, ఎలక్ట్రీషియన్ యూనియన్లు
- పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీల నేతలు, అక్కన్నపేట రజక సంఘం మహిళలు

రామాయంపేట, సెప్టెంబర్ 30: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ దేశంలోనే తెలంగాణను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రామాయంపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆటో, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ యూనియన్ సంఘాల నాయకులు బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతూ తీర్మానాలు చేసి ఎమ్మెల్యేకు అందజేసి, గులాబీ పార్టీలో చేరారు. వారందరికీ, అక్కన్నపేట కాంగ్రెస్, బీజేపీలకు చెందిన రజక సంఘం మహిళలకు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసమే ప్రజల వద్దకు వస్తారు తప్ప ఎన్నికల తర్వాత కనుచూపు మేరలో కూడా కనిపించరన్నారు. 70 ఏండ్లలో లేని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో చేసి చూపించారన్నారు. రామాయంపేటలో వివిధ సంఘాలు బీఆర్ఎస్‌లో చేరడం, మద్దతు పలుకడం సంతోషంగా ఉన్నదని, ఇంతే ఉత్సాహంతో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పని చేయాలని పిలుపునిచ్చారు.

### ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరిస్తా..



ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన అక్కన్నపేట రజక సంఘం మహిళలు

ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరిస్తానని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ముస్లింలు ఖబరస్తాన్ స్థలం కోసం రామాయంపేటలో మూడు ఎకరాలను కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ న్యాయమైన కోరికలను తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముస్లింలు శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, సరాఫ్ యాదగిరి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, కో ఆప్షన్ సభ్యులు పాతూరి ప్రభావతి, బాలుగౌడ్, హైమద్, అస్నొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు దేవుని రాజు, కొండల్‌రెడ్డి, కేకే గౌడ్, డైరెక్టర్లు చింతల రాములు, మర్కు దత్తు, గణేశ్, బచ్చ రాజుపల్లి మల్లేశం, రమేశ్ తదితరులున్నారు.

# బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

అందోల్, సెప్టెంబర్ 30: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం వట్‌పల్లి మండలం పోతులబొగుడలోని ఎమ్మెల్యే నివాసంలో రేగోడ్ మండలం సంగమేశ్వర్ తండాకు చెందిన వార్డు సభ్యుడు తుల్జానాయక్‌తోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు, మర్పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



అందోల్ : ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రేగోడ్ మండల నాయకులు